
భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 25.0
తణుకు : 31.0 - 27.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు

5

గురువారం 11 జూలై 2024



ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉచిత ఇసుక విధానం గందరగోళంగా మారింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఆధార్‌కార్డు ఉంటే రోజుకో లారీ ఇసుక ఇస్తుండగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇంటి ప్లాన్ ఉంటేనే ఇసుక ఇవ్వాలని నిబంధన విధించడంతో ఒక వైపు విని యోగదారులు, మరో వైపు టిప్పర్ లారీల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి రెండు జిల్లాల్లోనూ అన్ని ర్యాంప్‌లలో ఇసుక ఎగుమతులు నిలిచిపోయాయి. ఉన్న కొద్దిపాటి స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్టాక్ పాయింట్‌లలో సకాలంలో ఎగుమతులు కాక టిప్పర్ లారీల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన విధి విధానాలు రూపొందించాలంటూ లారీ అసోసియేషన్ నేటి నుంచి లారీల బంద్‌కు పిలుపునిచ్చింది..

ఉచిత ఇసుకలో గందరగోళం

పాలకొల్లు, జూలై 10: ఉమ్మడి పశ్చిమలో ఇప్పటికే ర్యాంపులన్నీ మూత పడ్డాయి. ఒక వైపు గోదావరికి వరద వచ్చే సూచనలు ఉండటం, ఎగువన వర్షాలు కురవడంతో గోదావరిలో నీటి ఉధృతి పెరగడం, బాటలు లేకపోవడం, పడవలు ద్వారా ఇసుకను ఒడ్డుకు చేర్చే ర్యాంప్‌లలో సైతం తవ్వకాలకు ఇంకా అనుమతి లభించకపోవడం తదితర కారణాలతో ర్యాంప్‌లలో పూర్తి స్థాయిలో ఇసుక సేకరణ నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వం పక్క జిల్లాల నుంచి ఉచిత ఇసుకు తీసుకు తెచ్చుకునేందుకు అనుమతి ఇచ్చింది. కానీ ఇక్కడి నుంచి అక్కడకు వెళితే అక్కడ నిబంధనలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక ఉచిత పాలసీ అమలులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో టన్ను రూ.270 చొప్పున అమ్ముతున్నారు. 20 టన్నులు కొనుగోలుకు రూ. 5,400 చెల్లించాల్సి ఉండగా దూరాన్ని బట్టి లారీ కిరాయితో కలుపుకుని రూ.10 నుంచి 11 వేలు మధ్యలో నాలుగున్నర యూనిట్లు ఇసుక లభిస్తుంది. అయితే గత ప్రభుత్వంలో అమ్మకాలతో పోలిస్తే వీటి ధర తక్కువే అయినప్పటికీ విశాఖపట్టణం, నర్సీపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేయాలంటే గతంలో టన్ను ఇసుక రూ. 950లకే నేరుగా వినియోగదారుని ఇంటికే చేరేది. ఇపుడు స్టాక్ పాయింట్లలోనూ టన్నుకు రూ.1395 రూపాయలు చెల్లించాల్సి వస్తున్నది. దీనికి కిరాయి అదనం. అంటే సుమారు గత ధర కంటే ఇపుడు రెట్టింపు అవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే పలువురు ప్రజా ప్రతినిధులు ఇసుకను బొక్కేశారు. రాజమండ్రి లాలా చెరువు ప్రాంతంలో పర్వతాల మాదిరి ఉన్న ఇసుక గుట్టలు రెండు రోజుల్లో ఖాళీ అయ్యాయి. రెండు జిల్లాల్లోనూ వారం రోజులపాటు ఇసుక దందా జరిగింది. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో నిల్వ చేసిన ఇసుకలో మూడు వంతులు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు.

- పశ్చిమలో ఒక రూల్.. తూర్పులో మరోలా
- అక్కడ ప్లాన్ ఉంటేనే ఇసుక సరఫరా..
- నిబంధనలతో వినియోగదారులకు ఇక్కట్లు
- నేటి నుంచి లారీల బంద్‌కు పిలుపునిచ్చిన అసోసియేషన్



అక్కడ అలా..ఇక్కడ ఇలా..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆధార్‌కార్డు ఉంటే ఇసుక ఇస్తున్నారు. ఈ విధానంలో ట్రాక్టర్ లేదా రెండు మూడు యూనిట్ల లారీలు సైతం అవకాశం కలుగుతుంది. చిన్నతరహా వినియోగాలకు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది.తూర్పుగోదావరి జిల్లాలో గృహ నిర్మాణాలకు అప్రూవ్డ్ ప్లాన్ ఉంటేనే ఇసుక ఇచ్చే విధానం అమలు చేయడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ గోడలు, చిన్నతరహా నిర్మాణాలకు అప్రూవడ్ ప్లాన్‌లు ఉండవు. ఇలాంటి వారంతా ఇసుక కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విధానం అమలైతే పేద వర్గాలకు ఇసుక అందదని అంటున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికి ఇసుకను ఉచితంగా ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం అమలులో సాధ్యం కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సంబంధిత అధికారుల అవగాహన లోపమేనని తెలుస్తున్నది. ఉచిత ఇసుక పేదలకు అందేలా చూడాలని ఇసుకాసురులు రెచ్చిపోకుండా కట్టడి చేయాలని పలువురు సూచిస్తున్నారు.

స్థానిక ర్యాంపుల నుంచి ఇవ్వాలి

ఆచంట : కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అందరూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉచిత ఇసుక కావాలంటే స్టాక్ పాయింట్‌ల వద్దకు వెళ్లాల్సి ఉంది. దగ్గరలోని రావులపాలెం, కొవ్వూరులలో ఇసుక పాయింట్‌లు ఉన్నాయి. ఒక యూనిట్ ఇసుక కావాలన్నా తూర్పుగోదావరి జిల్లాకు వెళ్ళి తెచ్చుకోవాల్సిందే. అయితే ఇసుక ఖరీదు కంటే కిరాయి అధిక మొత్తం అవుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇక్కడి నుంచి ఇతర జిల్లాకు వెళ్లి ఇసుక పొందాలంటే అక్కడ అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌లున్నాయి. ఈ ర్యాంప్‌ల నుంచి ఉచిత ఇసుక విధానాన్ని కల్పిస్తే ఆచంట నియోజకవర్గంతో పాటు పాలకొల్లు, తణుకు, భీమవరం నియోజకవర్గాలకు ఉపసయోగపడుతుందని పలువురు అంటున్నారు. రానున్న రోజుల్లో గోదావరి వచ్చే అవకాశం ఉన్నందున ప్రస్తుతం అందుబాటులో ఉన్న ర్యాంప్‌ల వద్ద నుంచి ఇసుక సరఫరాకు అవకాశం కల్పిస్తే గోదావరి వచ్చిన తరువాత ఎపుడైనా స్టాక్ పాయింట్ నుంచి తీసుకోవచ్చునని పలువురు అంటున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి ర్యాంప్‌ల నుంచి సరఫరాకు అవకాశం కల్పిస్తే ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక విధానానికి మంచి పేరు వస్తుందని పలువురు అంటున్నారు.

నేటి నుంచి టిప్పర్ లారీలు బంద్

అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి రాజా



ఉమ్మడి పశ్చిమలో ఇసుక టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ బంద్‌కు పిలుపు నిచ్చింది. పూర్తిస్థాయిలో గురువారం నుంచి టిప్పర్ లారీలు నిలిపి వేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి రాజా తెలిపారు. చంద్రబాబు సదుద్దేశంతో ఉచిత ఇసుక ప్రకటిస్తే అధికారులు అవగాహన లోపంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని సరైన విధి విధానాలు రూపొందించేవరకు ఇసుక ఎగుమతులకు వెళ్లేది లేదని స్పష్టం చేశారు. గనుల శాఖ మంత్రి ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఇసుక తరలించవచ్చునని చెప్పినప్పటికీ అధికారులు అంగీకరించడం లేదన్నారు. ఉచిత ఇసుక సరఫరాపై సమగ్ర ప్రణాళిక ఇవ్వాలని మంత్రులను కలిసి చెప్పినప్పటికి స్పందించనందునే నేటి నుంచి లారీల సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇసుకను చేరవేసే టిప్పర్ లారీలు సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు.



వైద్యసేవలు ఎలా ఉన్నాయి ?

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ నాగరాణి

అన్ని విభాగాల్లో పరిశీలన..రోగులతో మాట్లాడి ఆరా..



బాలింతలతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం క్రైం, జూలై 10 : భీమవరం ఏరియా ఆసుపత్రిలో జిల్లా స్థాయి సేవలు అందించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. బుధవారం భీమవరం ప్రభుత్వాసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి వార్డు, మందులు నిల్వ కేంద్రం, పరిపాలన, ఓపీ విభాగాలు, ల్యాబ్, స్కానింగ్, ఎక్స్‌రే యూనిట్లను పరిశీలించారు. ప్రసూతి వార్డులో నవజాతి శిశువులను, తల్లులకు అందుతున్న వైద్య సహాయంపై ఆరా తీశారు. బాలింతలు,గర్భిణులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రసవాలు ఎలా జరుగుతున్నాయి ? చెకప్ బాగా జరుగుతోందా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులో చికిత్స పొందుతున్న 18 ఏళ్ల యువతితో మాట్లాడుతూ ఇబ్బంది ఏమిటని అడిగారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదని డీసీహెచ్‌ఎస్ వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ ఆ యువతిని సున్నితంగా మందలించారు. ప్రతీ సమస్యకు చావు పరిష్కారం కాదని, సమస్య పరిష్కారానికి ఆలోచనతో ముందుకు సాగాలని హితవు పలికారు. మందుల విభాగాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు మందుల ఎక్స్పైరీ డేట్‌లను పరిశీలించుకోవాలన్నారు. బాలింత ల కోసం రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఎల్‌సియూ యూనిట్ ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. ఈ యూనిట్ వల్ల తల్లి చనుబాలను బిడ్డకు సరిగ్గా అందించలేని సయమంలో తల్లిపాలను యూనిట్ ద్వారా సేకరించి బిడ్డకు అందించడానికి వీలువుతుంది. ప్రస్తుతం భీమవరం ఏరియా ఆసుపత్రి 50 పడకల స్థాయిలో కొనసాగుతుందని, నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వైద్యసేవలను మరింత విస్తరించడానికి అవకాశం ఉంటుందని హాస్పటల్స్ సర్వీసెస్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ వివరించారు. ఆసుపత్రి పరిశీలన అనంతరం మెడికల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతూ ఓపీ విభాగాన్ని మరింత పటిష్టపరచాలని, రోగులకు అందిస్తున్న సేవలను విస్తృత పరచాలని, ఓపీ హాల్లో రోగులు కూర్చోవడానికి ఇబ్బంది లేని విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కళ్యాణి, ఆర్ఎంవో డాక్టర్ ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి మార్గాలు చూపండి

మత్స్యకారుల జీవనోపాధికి మెరుగైన ఉపాధి మార్గాలను ఎంపిక చేయాలని కలెక్టర్ నాగరాణి మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. మత్స్యకార మహిళలకు ఉపాధి అవకాశంలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ సబ్సిడీ యూనిట్‌ల కింద రొయ్యలు ఒలిచి పెద్ద ప్రాసెసింగ్ యూనిట్లకు సరఫరా చేసేలా షెడ్ల ఏర్పాటుకు రుణాలను మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకార కుటుంబాలలో పిల్లలు విద్యను అభ్యసించేందుకు మెరుగైన అవకాశాలను కల్పించాలి. జిల్లాలో మొత్తం 1,24,735 ఎకరాల్లో 24,677 రైతుల ఆక్వా సాగు చేస్తున్నారు. 1,16, 257 ఎకరాల్లో ఆక్వాజోన్ విస్తరించి ఉందని జిల్లాలో 20 ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఉన్నాయి. 16,234 ఆక్వా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 13,827 కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ ఉందని కలెక్టర్ అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, బీఎఫ్‌వోలు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద విచారణ చేపడుతున్న డీఎంహెచ్‌వో

తప్పుడు రిపోర్టులతో రోగులను భయపెడితే చర్యలు తప్పవు

డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 10: తప్పుడు రిపోర్టులతో రోగులను భయపెట్టి అధిక సొమ్ములు వసూలు చేసే ఆసుపత్రులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో) మహేశ్వరరావు హెచ్చరించారు. ఒక బాధితురాలి ఫిర్యాదు మేరకు తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రి వద్ద బుధవారం డీఎంహెచ్‌వో విచారణ చేపట్టారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఓ వృద్ధురాలు టీచర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆమె గత నెల 28న కంటి ఆసుపత్రి వద్ద కంటికి సంబంధించిన పరీక్ష చేయించుకుంటే శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. ఇతర వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమెకు హెచ్‌ఐవీ పాజిటివ్ ఉందని ఈహెచ్‌ఎస్‌కు అదనంగా మరో రూ.10 వేలు చెల్లించాల్సి వస్తుందని వైద్యులు చెప్పారు. దీంతో ఆమె కుమారుడు ఈ వ్యవహారంపై అనుమానం వచ్చి మరోకసారి నిర్ధారణ చేసుకోవాలని కోరగా ఆ వైద్యుడి నుంచి కూడా అదే సమాధానం రావడంతో బయట పరీక్షించేందుకు సిద్ధమయ్యాడు. దీంతో వైద్యులు మరోసారి ఆమెకు వైద్య పరీక్షలు చేస్తామని చెప్పి రిపోర్టు తప్పుగా వచ్చిందని హెచ్‌ఐవీ నెగిటివ్ ఉందని తమ తప్పును సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారంపై వృద్ధురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆమె ఆదేశాలతో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బాధితుల రిపోర్టు పరిశీలించి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

దోపిడీ



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అద్దె నొక్కుడు

- జేబుల్లో వేసుకున్న వైసీపీ నేతలు
- యజమానులకు తక్కువ మొత్తంలో చెల్లింపు
- ప్రభుత్వం నుంచి అధిక వసూళ్లు
- మాట చెల్లుబాటు కాకుంటే అధికారులపై వేటే



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అద్దె దోపిడీ యథేచ్ఛగా సాగింది. వైసీపీ నేతలు అడ్డంగా దోచుకున్నారు. దుకాణాలకు అద్దె పెంచేశారు. అధికారులే షాపుల యజమానులతో సంప్రదించిన చోట తక్కువ మొత్తానికి షాపులను అద్దెకు తీసుకున్నారు.నేతలు జోక్యం చేసుకోవడంతో ప్రతినెలా ప్రభుత్వం చెల్లించే అద్దె ధరలు పెరిగి పోయాయి. దాంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అద్దె ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. ప్రతినెలా కనిష్టంగా రూ. 7 వేలు అద్దె చెల్లించే షాపులున్నాయి. గరిష్టంగా రూ. 35 వేల వరకు చెల్లిస్తున్నారు. ఒక్కో పట్టణంలో ఒక రీతిన షాపులు నిర్వహిస్తున్నారు. భీమవరం, తాడేపల్లి గూడెం, తణుకు, నర్సాపురం పట్టణాల పరిధిలో అద్దెలు అధికంగా ఉన్నాయి. అదే మాల్స్ అయితే వైసీపీ నేతల దోపిడీకి అడ్డు అదుపూ లేకుండా పోయింది. ప్రభుత్వం ప్రతి నెలా రూ. 1.40 లక్షల అద్దె చెల్లిస్తోంది. షాపు యజమానులకు మాత్రం రూ. 33 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. అద్దె వ్యత్యాసం మొత్తం ఇప్పటిదాకా వైసీపీ నేతల జేబులకు వెళ్లింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం విక్రయించే విధానాన్ని తెరపైకి తెచ్చారు. మద్యం ధరలు అనూహ్యంగా పెంచేశారు. నాసి రకం మద్యం సరఫరా చేస్తూ వచ్చారు. అద్దెల విషయంలో ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. సిండికేట్ అయిన చోట అద్దెలను విపరీతంగా పెంచేశారు. తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు పట్టణాల్లో ఇటువంటి దందా అధికంగా ఉంది. ఇక్కడ వైసీపీ నేతలే చక్రం తిప్పారు.

తీర్మానాన్ని పక్కనపెట్టి..

తాడేపల్లిగూడెంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వ మద్యం షాపు ఉంది. అక్కడ రూ. 8000 అద్దెకు మున్సిపాలిటీ షాపులను కేటాయించారు. అదే షాపులో ప్రభుత్వ మద్యం దుకాణానికి రూ. 35 వేలు చెల్లిస్తున్నారు. షాపు నిర్వాహకునికి ప్రతీనెలా రూ. 27 వేలు లబ్ధి చేకూరుతోంది. మిగిలిన చోట్ల ముందుగానే ప్రైవేటు షాపు యజమానులతో వైసీపీ నేతలు సంప్రదింపులు జరిపారు. తక్కువ మొత్తానికి షాపులను తీసుకున్నారు. అవే షాపులను ప్రభుత్వ మద్యం దుకాణాల కోసం ఇచ్చారు. ఇలా ప్రతినెలా పెద్ద మొత్తంలోనే వైసీపీ నేతలు లబ్ధి పొందారు. ఇతర పట్టణాల్లోనూ ఇదే రకమైన దందా సాగింది. జిల్లా వ్యాప్తంగా 195 షాపులున్నాయి. అందులో 100కి పైగా షాపుల్లో అధికమొత్తంలో అద్దె చెల్లిస్తున్నారు. ఆ సొమ్మంతా వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లింది. ప్రభుత్వ మాల్స్‌లోనూ అదే దందా నిర్వహించారు.ప్రతీ ఏటా లక్షలాది రూపాయలు లబ్ధి పొందారు.

దృష్టి సారించిన కూటమి నేతలు

ఇప్పటిదాకా అద్దె రూపంలో పెద్దమొత్తంలో వైసీపీ నేతలు లబ్ధి పొందుతున్న విషయాన్ని కూటమి నేతలు గుర్తించారు. గతంలోనే ఈ విషయమై నిలదీశారు. వైసీపీ నేతల దోపిడీని బహిర్గతం చేశారు. ప్రభుత్వం కొత్త విధానం అమలులోకి తీసుకు వచ్చిన తర్వాత అద్దె దోపిడీకి అడ్డుకట్టు పడే అవకాశం ఉంది. నూతన విధానం ఎలా ఉంటుందనే విషయమై ఇప్పుడంతా ఆసక్తి నెలకొంది. బార్‌ల విషయంలోనూ వైసీపీ నేతలు భారీగా లబ్ధిపొందారు. బార్ యజమానులు సిండికేట్ అయ్యారని తెలిసి వైసీపీ నేతలు లక్షలాది రూపాయలు కమీషన్ రూపంలో తీసుకున్నారు. గడచిన ఎన్నికల్లోనూ ఉచితంగా బార్‌ల నుంచి మద్యాన్ని తరలించారు. అన్ని విధాలుగా వైసీపీ నేతలు లబ్ధిపొందారు. అధికారం కోల్పోయిన తర్వాత మాజీ ప్రజా ప్రతినిధులకు అన్ని విధాల అడ్డుకట్ట పడుతోంది. కూటమి నేతలు వైసీపీ నేతల దందాను వెలికి తీస్తున్నారు.

మాధవాయిపాలెం రేవు ధరలు పెంపు



నరసాపురం రూరల్, జూలై 10: నరసాపురం నుంచి భీమవరం 33 కిలోమీటర్లు... ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లితే రూ..30, అదే బస్సులో వెళ్లితే రూ.50. ఒకగంట ప్రయాణం. నరసాపురం నుంచి గోదావరి దాటి కోనసీమ జిల్లాలో అడుగు పెట్టాలంటే 200 మీటర్లు మాత్రమే. ప్రయాణ వ్యవధి కేవలం ఐదు నిమిషాలు.. ఈ దూరానికి టిక్కెట్ ధర మనిషికి ఐదో పదో ఉంటుందని అనుకుంటే పొరపడినట్టే.. గోదావరి దాటేందుకు పంటు ఎక్కాలంటే జేబులో రూ.20 నోటు ఉండాలి.. అదే బైక్‌తో ఎక్కితే రూ..35 టిక్కెట్ కొనాల్సిందే. ఇక పేదవాడు వాడే సైకిల్‌కి అయితే రూ.20 టిక్కెట్ కొనాల్సిందే. గత ప్రభుత్వం దేన్ని విడిచి పెట్టలేదన్న దానికి ఇదే నిదర్శనం. భారీగా ధరలు పెంచి గోదావరిపై రాకపోకలు సాగించే ప్రయాణికుల నడ్డి విరిచింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఈ ధరల్ని తగ్గించాలని ప్రయాణి కులు డిమాండ్ చేస్తున్నారు.

ఏటా పాట ద్వారా కోట్లలో ఆదాయం..

రాష్ట్రంలో నరసాపురంలోని మాధవాయిపాలెం రేవు అతి పెద్దది. నిత్యం పదివేల మంది పైనే కోనసీమ, పశ్చిమ జిల్లాలను పంటు, పడవలపై దాటుతుంటారు. ఏటా ప్రభుత్వానికి రూ.3 కోట్లు పైనే రేవు పాట ద్వారా ఆదాయం లభిస్తుంది. రెండు జిల్లాల సరిహద్దుల దూరం కేవలం 200 మీటర్లే కావడం, గోదావరిపై ప్రయాణించేందుకు పంటు వంటి సులభతర నీటి రవాణ సౌకర్యం ఉండటంతో ఎక్కువ మంది నరసాపురం గుండానే కోనసీమ వెళుతుంటారు. దీంతో ఏటా ప్రభుత్వానికి ఈ రేవు ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతూ వస్తుందే తప్ప తగ్గడం లేదు. కొవిడ్ కారణంగా రెండేళ్ల రేవు పాట సక్రమంగా నిర్వహించలేదు. ఆ తరువాత పాటదారుల మధ్య పోటీ పెరగడంతో రేవు ఆదాయం గణనీయంగా పెరిగింది. అప్పటి వరకు ఏటా రూ.2 కోట్లు దాటని ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2.70 కోట్లు రాగా గతేడాది రూ.3.61 కోట్లు వెళ్లింది. ఇదే ఆల్‌టైం రికార్డు. ప్రభుత్వానికి ఆదాయం ఎలా ఉన్నా ప్రయాణికుల నడ్డి మాత్రం విరిగిందన్న వాదనలు లేకపోలేదు.

భారీగా పెంచిన టిక్కెట్ రుసుం..

కొవిడ్‌కు ముందు టిక్కెట్ ధరలు ప్రయాణికులకు అందుబాటులో ఉండేవి అప్పటి వరకు మనిషికి రూ.15 ఉండేది. దాన్ని రూ. 5 పెంచి రూ.20 చేశారు. అదే బైక్‌తో వెళ్లితే రూ.30 ఉండేది. దానికి ఐదు పెంచారు. మూడు చక్రాల వాహనానికి రూ.80 ఉండేది దాన్ని రూ.100కి పెంచారు. నాలుగు చక్రాల వాహనానికి రూ.120 ఉంటే దాన్ని రూ.150 చేశారు. 25 కేజీల లగేజీ రూ.20 ఉండగా రూ.30కి పెంచారు. అయితే జంతువుల టిక్కెట్ల మాత్రం పెంచలేదు, మేక, కుక్క, గొర్రెలకు ధరలు రూ.15లే ఉంచారు. రోజుకు సీజన్‌లో అయితే 10 వేల మందిపైనే రేవు దాటుతుంటారు. వీరిలో అత్యధిక మంది సింగిల్‌గా వెళ్లేవారితో పాటు బైక్‌లతో పంటు ఎక్కే ప్రయాణికులే ఉంటారు. ఈ రెండు ఛార్జీల వల్ల ప్రయాణికులపై అదనపు భారం పడినట్లైయింది. ఇలా ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం ఎలా ఉన్నా పాటదారుడికి మాత్రం భారీగా మేలు జరిగిందన్న వాదనలు అప్పట్లో గుప్పుమున్నాయి. కొందరి అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల వల్లే జాయింట్ యాక్షన్ కమిటీ ఛార్జీలు పెంచిందన్న వాదనలు అప్పట్లో షికారు చేశాయి. అయితే అధికారులు వీటిని కొట్టేశారు. మూడేళ్లకు ఒకసారి ఛార్జీలు పెంచడం పరిపాటంటూ చెప్పుకొచ్చారు.

- దూరం తక్కువ..టిక్కెట్ ధర ఎక్కువ
- గత ప్రభుత్వ హయాంలో భారీ ధరలు
- పాటదారుల కోసమే ఈ పెంపు
- తగ్గించాలని ప్రయాణికుల డిమాండ్



ప్రభుత్వం మారినా..ఇదే తీరు

నెలకు సుమారు 3 లక్షల మంది పైనే ఈ రేవు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అత్యధికులు సామాన్య, మధ్య తరగతి, రైతు వారి కుటుంబాలే ఉంటాయి. వీరికి పెరిగిన ధరలు భారంగా కనిపిస్తున్నాయి. ఇంత తక్కువ దూరానికి అంతా ఛార్జీనా అన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పటి వరకు రేవు నిర్వహణ అంతా పాటదారుడి చేతిలో ఉంది. ప్రస్తుతం నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే చేపట్టింది. ఈ పరిస్థితుల్లో గత ప్రభుత్వం పెంచిన ఛార్జీలను తగ్గిస్తే ప్రయాణికులకు కొంత ఊరట లభించినట్టు అవుతుందన్న వాదనలు రెండు జిల్లాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తగ్గించాలి



రేవు దాటే ప్రయాణికుల్లో ఎక్కువ మంది రైతులతో పాటు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలే ఉంటాయి. నరసాపురం పట్టణ వ్యాపార అంతా కోనసీమ జిల్లా వచ్చే ప్రయాణికుల పైనే ఆధారపడి ఉంటుంది. ధరలు తగ్గిస్తే అన్ని వర్గాలకు మేలు చేకూర్చినట్లు అవుతుంది.

-కొప్పాడ రవి,నరసాపురం

నేటి నుంచి రైతు బజార్లలో కందిపప్పు





గోదారి పెరిగింది..

నేడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారి జాబితా విడుదల 7

ఉగ్రనారసింహునిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 10: శ్రీలక్ష్మీ సమేత ఉగ్ర నారసింహునిగా జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురం ఆలయంలో ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దీనిలో భాగంగా లక్ష్మీమాతతో కలసి జగన్నాథుడు శంఖు, చక్రాలను ధరించి, ఉగ్రరూపంలో భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు నరసింహుని అలంకారం చూపరులకు కనువిందు చేసింది.

ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్లకు తగ్గించండి

» మంత్రి నారా లోకేశ్‌కు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

ఏలూరు అర్బన్, జూలై 10 : ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటే, తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని కోరుతూ మంత్రికి బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసినట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యంచేస్తున్న జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాలని, హైస్కూళ్లలో రద్దుచేసిన గ్రేడ్-2 హెచ్ఎం, పీడీ పోస్టులను పునరుద్ధరించాలని కోరామన్నారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షలపై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఐదురోజుల పాటు ఇచ్చే గుడ్లను తీసుకోవడానికి విద్యార్థులు ఇష్టపడడం లేదని, వీటిని వారానికి మూడు రోజులకు కుదించి, ఆరు రోజుల పాటు చిక్కీలను సరఫరాచేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించామన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులపై గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన కేసు నెంబరు 247/23ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

శ్యామలాంబ అమ్మవారికి ఆషాఢ సారె



కైకలూరు జూలై 10 : కైకలూరులోని శ్యామలాంబ అమ్మవారికి, ఆలయంలో కొలు వైన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ఆషాఢ సారెను వికాస తరంగిణి ఆధ్వర్యంలో అందజేశారు. బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి వికాస తరంగణి, శ్రీమన్నారాయణ గోష్ఠి మహిళలు సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. గోష్ఠి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అమ్మవారికి, స్వామికి సారెను అందజేశారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి

పోలవరం, జూలై 10 : పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.700 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.720 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.800 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.690 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6,372 క్యూసెక్కుల విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు బుధవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.022 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 18 పంపులు 18 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు 2.9260 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

గోదావరిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పారేయొద్దు

పాపికొండల టూరిజం సంద ర్భాలలో బోట్లలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు, డ్రింకు బాటిళ్ళు గోదావరి నదిలో గానీ పాపికొండల నేషనల్ పార్కులో గానీ పారేయరాదని పోలవరం అటవీ క్షేత్రాధికారి ఎన్.దావీదురాజు సూచించారు. బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పర్యాటక బోట్ల నిర్వాహకులతో అటవీశాఖ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో పారేయడం వల్ల పర్యావరణంలో వన్యప్రాణులకు హాని కలుగుతుం దని, బోట్లలో అతిధ్వనులు చేసే సౌండ్ బాక్సుల వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలుగుతుందని పరిమితి మేరకే వాడాలని సూచించారు.



పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద గోదావరి జలాల ఉధృతి..

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నీటి విడుదల

నేటి నుంచి రైతు బజార్లలో కందిపప్పు

» కిలో రూ.160కే విక్రయం : సత్యకుమార్



మాట్లాడుతున్న సత్యకుమార్

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, జూలై 10 : రాష్ట్రంలో కందిపంట ఆశించినంత దిగుబడిలేక పోవడంతో కొరత ఏర్పడిందని, ప్రస్తుతానికి కొరత లేదని గురువారం నుంచి రూ.160లకే కిలో కందిపప్పు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఏలూరు దాల్ మిల్లర్స్ దాల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.టి.వి సత్యకుమార్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర మంత్రి, కమిషనర్, ఇతరశాఖల అధికారులతో రాష్ట్రంలోని దాల్ మిల్లర్స్, రైస్ మిల్లర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారని, సమావేశంలో రాష్ట్రంలో కంది పప్పు కొరతకు సంబంధించి వివరాలను మంత్రి అడిగి తెలుసుకు న్నారన్నారు. రాష్ట్రంలో రూ.160లకే కందిపప్పు విక్రయించాలని కోరారన్నారు. దీనిపై తాము సానుకూలంగా స్పందిస్తూ రూ.160లకే కంది పప్పు అందజేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. గురువారం ఉదయం ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల్లో ఉన్న రైతు బజార్లలో ఒక్కో కార్డుదారుడికి కిలో కందిపప్పు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో కందిపంట విస్తీర్ణం తగ్గిందని, ప్రస్తుతం రాష్ట్రంలో 25వేల క్వింటాళ్ళ కందిపప్పు అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం బర్మా, ఆఫ్రికాదేశాల నుంచి కంది దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. కంది పంట నిల్వ ఉంచేందుకు గొడౌన్స్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తే కందిపప్పు కొరత ఉండదన్నారు. ఏపీ చాంబర్స్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకాయల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కందిపంట రైతులను ప్రోత్సహించి మద్దతు ధర అందించడంతో పాటు గిడ్డంగులు ఏర్పాటుచేసి నిల్వ అవకా శం కల్పించాలని మంత్రి నాదెండ్లకు వివరించినట్లు తెలిపారు. బియ్యం ఒక రకం రూ.48, మరో రకం రూ.49లకే కేజీ అందించేందుకు రైస్ మిల్లర్స్ సిద్ధంగా ఉన్నారన్నారు.

పశ్చిమలో 8 ప్రాంతాల్లో...

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో గురువారం నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు జరుగుతాయి. భీమవరంలో రైతుబజార్, డి-మార్ట్, రిలయన్స్ సూపర్ మార్కెట్, పాలకొల్లు, నరసాపురం రైతుల బజార్లు, తాడేపల్లిగూడెంలో ఛాంబర్ ఆఫ్ కామర్సు భవనం, తణుకు ఆర్యవైశ్య కల్యాణ మండపం, అత్తిలిలో చాంబర్‌ఆఫ్ కామర్సు భవనంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు జేసీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు : రాజీవ్

ఏలూరు క్రైం, జూలై 10 : ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతిరోగికి ఉచితంగా వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యం అదనంగా డబ్బులు వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ వర్తింపు కల్గిన 31 ప్రైవేటు ఆసుపత్రులలో రోగులకు అందుబాటులో ఆరోగ్యమిత్రాలు ఉన్నారని, ఓపీలో ఔట్‌పేషెంట్ విభాగంలో టెస్టులు ఉచితంగానే చేస్తాయని ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓపీలో ఖర్చు పెట్టుకున్న సొమ్ము ఆరోగ్యశ్రీలోదే అయితే ఖర్చుపెట్టిన సొమ్మును ఇప్పించడం కూడా జరుగుతుందన్నారు. రోగికి అదనంగా డబ్బులు వసూలు చేయడం జరగదని ఒకవేళ అటువంటి చర్యలకు పాల్పడితే ఆరోగ్య మిత్ర వారు ఆన్‌బెడ్‌కు వెళ్ళినప్పుడు రోగి మా దగ్గర డబ్బులు వసూలు చేశారని రాతపూర్వకంగా తెలియజేస్తే వెంటనే వారు ఖర్చు పెట్టిన సొమ్ము తిరిగి ఇప్పించడంతో పాటు సంబంధింత ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి కూడా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం లేఖ ద్వారా ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందుతుందన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు లేని వారు, డబ్బులు కట్టి వైద్యం చేయించుకున్న వారికి అప్పుడు కొన్ని జబ్బులకు మాత్రమే సీఎంవో ద్వారా లేఖ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి మాత్రమే వైద్యం ఉచితంగానే అందిందని, లేని వారు సొమ్ము కట్టి వైద్యం చేయించుకున్నారన్నారు.

నిలిచిన సీటీస్కాన్ సేవలు

» ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పనిచేయని మిషన్

» ఐదు రోజులుగా రోగులకు తప్పని ఇబ్బందులు





సీటీస్కాన్ మిషన్.. ఏలూరు ప్రభుత్వాసుపత్రి

ఏలూరు క్రైం, జూలై 10 : ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సీటీస్కాన్ మిషన్ సేవలు ఐదు రోజుల నుంచి నిలిచిపోయాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు అనేక ఇబ్బందులకు గురై చివరకు తమ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రైవేటు స్కాన్ సెంటర్లకు వెళ్లి స్కానింగ్ చేయించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎన్‌ఆర్ఐ సంస్థ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎంఆర్ఐ, సీటీస్కాన్‌లను గత కొన్నేళ్ళుగా నిర్వహిస్తున్నారు. నిత్యం వందలాది మంది ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వస్తున్నారు. తలనొప్పి, పక్షవాతం, కడుపులో నొప్పి, కిడ్నీలకు సంబంధించిన వ్యాధులు, ఛాతీకి సంబంధించిన వ్యాధులు వంటి వాటికి రోజుకు వంద స్కాన్‌లుపైబడే ఇక్కడ తీస్తున్నారు. రిపోర్టు ఒకటి మాత్రమే పొందాలంటే ఇక్కడ సేవలు ఉచితంగానే చేస్తున్నారు. రిపోర్టుతో పాటు ఫిల్మ్ కావాలంటే అందుకు సంబంధించిన రుసుమును బయట స్కాన్ సెంటర్ల కంటే తక్కువగానే తీసుకుంటున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి స్కాన్ పనిచేయక పోవడంతో రోగులు తమకు ఏ విధమైన వ్యాధి ఉందో అని భయపడి ఆందోళనకు గురై ప్రైవేటు స్కాన్ సెంటర్లకు వెళ్లి సిటీస్కాన్ చేయించుకుంటున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి స్కాన్‌లు రోజూ వెళ్తానే ఉన్నాయి. ఈ పరిస్థితి గమనించి కొంతమంది ప్రైవేటు స్కాన్ సెంటర్ వారు తమ స్కాన్‌సెంటర్‌కు సంబంధించిన రిక్విజేషన్ ఫామ్‌లను ఆసుపత్రిలో వైద్యుల టేబుళ్ళపై పెట్టేశారు. రోగులు తమ వ్యాధి బాధతో తల్లడిల్లుతూ తమకు స్కాన్ రాయాలంటూ, బయట అయినా చేయించుకుంటామని ఒత్తిడి చేయడంతో వైద్యులు ఏమి చేయలేని పరిస్థితిలో చివరకు ప్రైవేటు స్కాన్ సెంటర్‌కు వెళ్ళి చేయించుకునేలా రిక్విజిషన్ రాస్తున్నారు. సంబంధిత సిటీస్కాన్ కంపెనీకి చెందిన ఇంజనీర్లు, టెక్నీషియన్లు వచ్చి పరిశీలన జరిపి సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తి వైరస్ ఉందంటూ అందుకు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్‌ను ఆ కంపెనీ నుంచే పొంది ఇక్కడ ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఎన్ని రోజులు పడుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం సీటీస్కాన్ సెంటర్ సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చిన రోగులు కోరుతున్నారు.

క్రైం కార్నర్





జ్యూస్ షాపును సీజ్ చేస్తున్న అధికారులు..కాలం చెల్లిన పాల ప్యాకెట్

శ్రీవారి శేషాచలంపై కాలం చెల్లిన పాల ప్యాకెట్లు

» జ్యూస్ తయారీదారుడిని నిలదీసిన భక్తుడు » రంగంలోకి ఫుడ్‌సేఫ్టీ అధికారులు » షాపు సీజ్.. యజమానిపై కేసు

ద్వారకాతిరుమల, జూలై 10: ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలంపై ఉన్న ఓ జ్యూస్ షాపులో కాలం చెల్లిన పాల పాకెట్లతో జ్యూస్‌ను తయారు చేయడాన్ని గమనించి షాపు యజమానిని ఓ భక్తుడు నిలదీసిన ఘటన జరిగింది. వివరాలివి.. చిన వెంకన్న దర్శనార్థం ఓ భక్తుడు బుధవారం క్షేత్రానికి వచ్చి దర్శనానంతరం కొండపైన ఉన్న శ్రీలక్ష్మీ దుర్గ బాలాజీ జ్యూస్ స్టాల్‌లో ఓ జ్యూస్ తయారీకి ఆర్డర్ చేశాడు. నిర్వాహకుడు తనవద్ద ఉన్న పాలప్యాకెట్‌తో జ్యూస్ తయారుచేసి భక్తునికి ఇచ్చాడు.. పాలప్యాకెట్లను పరిశీలించిన భక్తునికి అది గడువు దాటినదిగా గుర్తించి ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న ఆలయ లీజెస్ విభాగ సూపరింటెండెంట్ నరసింహరాజు షాపునకు వచ్చి తనిఖీలు చేపట్టారు. గడువు దాటిన 217 పాలప్యాకెట్లను గుర్తించి అధికారి ఖంగుతిన్నారు. అనంతరం ఏలూరు డివిజన్ ఫుడ్‌సేఫ్టీ అధికారి కె.రామరాజు వచ్చి పరిశీలించారు. ఆ పాల ప్యాకెట్లను చింపి ఓ పెద్ద టబ్‌లో పోయించి సీజ్ చేసి పరీక్షలకు పంపారు. అధికారి రామరాజు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ చట్టం 58 ప్రకారం షాపు యజమానిపై కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలుంటాయిని తెలిపారు.

దేవస్థానం కొండపై ఉన్న పలు షాపులను వేలం ద్వారా పాటదారులకు అద్దెకు ఇస్తుంది. ఆ తరువాత అధికారుల అజమాయిషీ కొరవడడంతో కొందరు షాపు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దోచుకుంటున్నారు. షాపు యజమాని చేసిన పనికి ఫుడ్ పాయిజన్ జరిగి భక్తులకు ఏదైనా జరిగితే దేవాలయానికి చెడ్డపేరు వస్తుందని.. ఇప్పటికైనా ఫుడ్‌సేఫ్టీ అధికారులు షాపులను తరచూ తనిఖీ చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

ద్వారకాతిరుమల, జూలై 10: ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద ఈనెల 8న తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న డ్రైవర్ దివి దుర్గవంశీ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆగిఉన్న ట్రాలీని వెనుక నుంచి ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో బొమ్మూరు మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని భాగ్యశ్రీ, ఆమె కుమారుడు నాగనితిన్‌కుమార్, భీమవరానికి చెందిన బొమ్మా కమలాదేవి అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాడపల్లికి చెందిన డ్రైవర్ దుర్గవంశీ చనిపోవడంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది. తీవ్రంగా గాయపడిన మరో చిన్నారి నాగషణ్ముఖ పరిస్థితి బాగానే ఉన్నట్లు చెబుతున్నారు.

శివాలయంలో చోరీ

బుట్టాయగూడెం, జూలై 10 :రెడ్డిగణపవరంలో వున్న కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి నగదును, విలువైన వస్తువులను ఎత్తుకుపోయారు. బుధవారం ఉదయం స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ అర్చకులు నాగభట్ల పద్మనాభశర్మ గుడివద్దకు వెళ్లడంతో విషయం బయటపడింది. వెంటనే ఈ విషయాన్ని గుడి పెద్దలకు, గ్రామస్థులకు చెప్పారు. ఆలయంలో సీసీ కెమేరాలు ఉన్నాయని తెలుసుకున్న దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తర్వాత కట్టర్‌తో తాళాలను, స్వామివారి కానుకల డిబ్బీని కోసి సుమారు రూ.70 వేల నగదును, సుమారు రూ.30 వేల విలువైన టీవీ, సీసీ కెమెరాల మానిటర్లను ఎత్తుపోయారు. ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు, ఉప సర్పంచ్ భౌమరాజు సత్యనారాయణరాజు పెద్దలు ఆధ్వర్యంలో అర్చకులు పద్మనాభశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోళ్లవ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 10 :చేపల చెరువులో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు చేసి వాహనాన్ని కోళ్లవ్యర్థాలతో పాటుగా పట్టుకున్నట్టు పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్, చేపల చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

పెదపాడు, జూలై 10 : కళాశాలకు వెళ్లిన కుమారుడు కాలేజీ అనంతరం తిరిగి ఇంటికి రాలేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన మానం బెనర్జీకి ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు సాయిసంతోష్ ఏలూరులోని సీఆర్‌రెడ్డి కాలేజీలో బీఎస్సీ చదువుతున్నాడు. ఈనెల 2వ తేదీన పరీక్ష ఉందని కాలేజీకి వెళ్లి సాయంత్రం కళాశాల నుంచి బయలుదేరి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు.



సర్వశిక్షా అభియన్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

రెండు నెలల జీతాల బకాయిలు చెల్లించండి

» ప్లకార్డులతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ఏలూరు అర్బన్, జూలై 10:సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మే, జూన్ నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని ఎస్ఎస్ఏ జిల్లా కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే బావాజీ మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చడం, రోజువారీ వేతన సిబ్బందిని రెన్యువల్‌చేయడం, ఉద్యోగ విరమణ వయస్సుని 62 ఏళ్లకు వర్తింపజేయడం, ఇంటి అద్దె సౌకర్యం, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు, వేకెన్సీల భర్తీ, కొన్ని నెలలక్రితం నిర్వహించిన సమ్మెకాలానికి జీతాల చెల్లింపు తదితర డిమాండ్లు ప్రభుత్వం ముందుంచామని వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల ఉద్యోగులకు కనీస వేతన స్కేలు (ఎంటీఎస్)ను వర్తింపజేయాలన్నారు. పరస్పర, రిక్వెస్టు బదిలీలలను చేపట్టాలన్నారు. త్వరలో చేపట్టనున్న మెగా డీఎస్సీ నియామకాల్లో ఎస్ఎస్ఏలో అర్హతలు గల ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ మహిళా కార్యదర్శి కె.రాజ్యలక్ష్మి, రాష్ట్ర కమిటీ నాయకులు కె.సోమరాజు, కె.మణికంఠరాజు, టి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారి జాబితా విడుదల

నూజివీడు, జూలై 10: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం ఉదయం పదకొండు గంటలకు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి ఏలూరు జిల్లా నూజివీడు క్యాంపస్‌లో విడుదల చేయనున్నారు. కార్యక్రమానికి ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు, అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్, నాలుగు క్యాంపస్‌ల డైరెక్టర్లు, అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారు.

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

» 13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు » మరో ముగ్గురు శాస్త్రవేత్తలకూ పురస్కారాలు » సత్కరించిన ఎంపీ పురందేశ్వరి



ఉత్తమ రైతు అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంపీ పురందేశ్వరి

దేవరపల్లి, జూలై 10: 'పొగాకు సాగులో రైతులతోపాటు శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని.. ప్రపంచంలోనే నాణ్యమైన పొగాకు ఉత్పత్తులకు మనదేశం పెట్టింది పేరు. అందులోనూ అత్యధిక స్థాయిలో పొగాకు పండించేది కూడా మన రాష్ట్రమే' అని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం కరుటూరి ఫంక్షన్ హాలులో టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) 24వ అవార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని పొగాకు శాస్త్రవేత్తలు, రైతులను అవార్డులతో సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం 16 మంది అవార్డులకు ఎంపిక కాగా, వారిలో 13 మంది రైతులకు, ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు రైతులు, శాస్త్రవేత్తలకు అవార్డులు అందించడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బతిందని, రైతుల కోరిక మేరకు పరిమితి మించి జరిగిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దుచేయాలని వాణి జ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో మాట్లాడామని, త్వరలోనే నిర్ణయం వస్తుందన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుం దన్నారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడారు. పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కు మార్ మాట్లాడుతూ పొగాకు పంట ద్వారా రూ.12 వేల కోట్ల విదేశీ మాదకద్రవ్యం లభిస్తోందని, ఈ పొగాకు పంటపై నాలుగు వేల కోట్ల మంది ఆధారపడుతున్నారన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పొగాకు బోర్డు వైస్ ఛైర్మన్ వాసుబాబు, టుబాకో బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్, పొగాకు రైతు సంఘం నాయకులు, అవార్డు గ్రహీతలు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, పలు పొగాకు కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు ధర రూ.381

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూ డెం పొగాకు వేలం కేంద్రాలలో వర్జీనియా పొగాకు మునుపెన్నడూ లేనివిధంగా కిలో పొగాకు ధర రూ.381కి చేరి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈనెల ఎనిమిదో తేదీన రూ.376 ఉండగా రెండు రోజుల్లోనే ఏకంగా ఐదు రూపా యలు పెరిగి రూ. 381కి చేరింది.రానున్న రోజు ల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశాలున్నాయి.

మదర్ థెరిస్సా హోమ్‌కు వృద్ధురాలి తరలింపు



వృద్ధురాలిని మదర్ థెరిస్సా హోమ్‌లో చేర్పించిన వన్‌స్టాఫ్ సెంటర్ సిబ్బంది

ఏలూరు క్రైం, జూలై 10 : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్‌స్టాఫ్ సెంటర్ ఉమెన్ హెల్ప్‌లైన్ 181 ద్వారా వచ్చిన సమాచారంతో ఓ వృద్ధురాలిని సంరక్షణకు తరలించారు. ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురంలో మంగళవారం రాత్రి పెదపాడు మండలానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు నిరాదరణతో గడపడాన్ని గమనించిన స్థానికులు 181 కాల్ సెంటర్‌కు సమాచారం అందించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కేపీవీఎల్ పద్మావతి ఆదేశాలతో వన్‌స్టాఫ్ సెంటర్ పరిపాలనాధికారిణి సీహెచ్ నిర్మల, మహిళా కార్యదర్శి, సిబ్బంది కలిసి బుధవారం ఉదయం వెళ్లారు. 60 ఏళ్ల వయస్సు ఉన్న కృష్ణకుమారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వన్‌స్టాఫ్ సెంటర్‌కు తీసుకువచ్చి సపర్యలు చేశారు. ఆమె కోసం విచారణ చేయడంతో ఎటువంటి సమాచారం ఇవ్వలేకపోయింది. ఆమె తాత్కాలిక వసతి నిమిత్తం వంగాయగూడెంలో ఉన్న మదర్‌థెరిస్సా హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. ఆ వృద్ధురాలికి సంబంధించిన తగిన ఆధారాలతో మహిళాఅభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏలూరు వారిని సంప్రదించాలని కోరారు. ఈ రిస్క్యూ టీమ్‌లో వన్‌స్టాఫ్ సెంటర్ ఏఎస్ఐ వేదకుమారి, కేసు వర్కర్ త్రివేణి, మహిళా కార్యదర్శి వైదేహి తదితరులు పాల్గొన్నారు.

పసిబిడ్డను దత్తత తీసుకున్న తెలంగాణ వాసులు



పసిబిడ్డను దత్తత తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, జూలై 10 : చంటి పిల్లలను నిరాదరించే తల్లులు ఆ చిన్నారులను ఎక్కడో కాల్వల్లోనూ, చెత్త కుప్పల్లోనూ పడవేయకుండా శిశు గృహంలో అప్పగిస్తే వారి సంరక్షణ తీసుకుని చట్ట ప్రకారం దత్తత ఇచ్చే అవకాశం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సెంట్రల్ ఎడాప్షన్ రిసోర్స్ అథారిటీ నియమ నిబంధనల ప్రకారం 2021లో దత్తతకు దరఖాస్తు చేసుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన సురేందర్, మహలక్ష్మి దంపతులకు ఏలూరు శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న మూడు నెలల వయస్సు గల మనోజ్ అనే బాబును బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె సమక్షంలో కేఐఎస్ వారి ద్వారా దత్తత తల్లిదండ్రులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దత్తత పొందిన పిల్లలను జాగ్రత్తగా పెంచాలని, విద్యా బోధనలు చెప్పించి ఉన్నతమైన స్థానంలోకి తీసుకురావాలన్నారు. వీరిపై పర్యవేక్షణ ఉంటుందని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి జిల్లా బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది గృహ సందర్శన చేసి పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను రిపోర్టురూపంలో సెంట్రల్ ఎడాప్షన్ రిసోర్స్ అథార్టీ వారి కారింగ్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేపీవీఎల్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డాక్టర్ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేని రూ.1.82 కోట్ల సరుకులు గుర్తింపు

ప్రత్తిపాడు ఎరువుల గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రత్తిపాడు ఎరువుల గోదాములు తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెంటపాడు, జూలై 10 : రికార్డులు సరిగా లేకుండా ఎరువుల విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తప్పవని విజయనగరం జిల్లా గజపతినగరం డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ కె.మహారాజన్ హెచ్చరించారు. మండలంలోని ప్రత్తిపాడు ఎంపీఆర్, ఐఎస్‌టీ ఎరువుల గోదాములలో మంగళవారం రాత్రి విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేకుండా ఎంపీఆర్ గోదాములో 66 టన్నులకు సంబంధించి రూ.21,12,000 విలువైన, ఐఎస్‌టీ గోదాములో 827 టన్నుల సంబంధించి రూ.1.61 కోట్లు విలువైన సరుకులను గుర్తించినట్టు తెలిపారు. రికార్డులు చూపించేంత వరకూ సరుకు అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ టి.శ్రీనివాసరెడ్డి, ఏవోలు పార్థసారథి, ఆర్ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

» లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలి » సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు



భీమవరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు


ఆకివీడులో డీటీ ఫరూఖ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు

భీమవరం అర్బన్, జూలై 10: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు డి.కళ్యాణి, బి.వాసు దేవరావు డిమాండ్ చేశారు. కార్మిక కోర్కెల దినం సందర్భంగా బుధవారం భీమవరం సీఐటీయూ కార్యాలయం నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు సిరీష్, వైకుంఠరావు, మహాలక్ష్మి, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఆకివీడు : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వీ గోపాలన్ అన్నారు. దేశవ్యాప్త డిమాండ్ డేలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అంగన్‌వాడీలతో కలిసి ధర్నా చేసి డీటీ ఫరూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు, ఫైడేశ్వరీ, కేశిరెడ్డి ధనరాజు, తోట పద్మ, తదితరులు ఉన్నారు.

● తణుకు : కార్మికుల సమస్యలను కేంద్రం పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. నరేంద్ర సెంటర్ వద్ద సీఐటీయూ పిలుపు మేరకు కార్మికులు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ముక్తేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు గార రంగారావు, దక్షిణామూర్తి, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

● పెనుమంట్ర : లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని పెనుమంట్ర సీఐటీయూ మండల అధ్యక్షుడు వి.వెంకటరత్నం, కార్యదర్శి కె.ప్రసాద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బ్రాహ్మణ చెరువు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కె.లక్ష్మి కళ్యాణ్‌కి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం నాయకులు కె.సుబ్బరాజు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఆచంట : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి ఆశ వర్కర్ల సంఘం మండల కార్యదర్శి నక్కా శైలజ పిలుపునిచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఐపీ శెట్టికి అందజేశారు. వైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, జి.వెంకట రమణ, జి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

● మొగల్తూరు : అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఐకేపీ సీఏ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీలు పెద్దింట్లు, శారమ్మ, సీతారత్నం, ఆశ వర్కర్లు బేబి కుమారీ, రేవతి, ఝాన్సీ, లక్ష్మీ పాల్గొన్నారు.

● పెనుగొండ : లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా హెచ్చరించడానికి దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డేని కార్మికులు నిర్వహిస్తున్నారని సీఐటీయూ పెనుగొండ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్లు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్‌లు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. షేక్ పాదుషా, కె.తులసి, జి.లక్ష్మి, కె.లక్ష్మి కుమారి, కార్మికులు పాల్గొన్నారు.

● ఇరగవరం :కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులు పి.శ్యామల సత్యదేవి, పి.అంజనాదేవి పాల్గొన్నారు.

● పెంటపాడు : అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగరావు, దూలం ప్రసాద్, చిర్లా పుల్లారెడ్డి, జే.శ్యామలా కుమారి, బంకూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఉండి : కార్మికుల హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టారు. తహసీల్దారు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు నిమ్మితి కిశోర్, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● నరసాపురం రూరల్ : లేబర్ కోడ్‌ను రద్దు చేసి అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు, టి.సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : కార్మిక సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపు మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, వివిధ కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, పార్కుల అభివృద్ధికి చర్యలు


ఉండి పార్కు వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనుమూరు

ఉండి జూలై 10: పూర్వపు పాఠశాల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణంరాజు స్పష్టం చేశారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(శతవార్షిక)ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆయన స్టేషన్ రోడ్ వద్ద ఉన్న అబ్బాయిరాజు పార్కును సందర్శించారు. ఉండి జనసేన ఇంచార్జి జుత్తుగ నాగరాజు, మండల, గ్రామ టీడీపీ అధ్యక్షులు కరిమెరక నాగరాజు, కాగిత బుజ్జి, సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జి, మాజీ సర్పంచ్ ఎం.విజయకృష్ణంరాజు, ఎం.సాయిలచ్చిరాజు, జి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఉండి ఎమ్మెల్యే రఘురామ

భీమవరం టౌన్ : జిల్లా కలెక్టరు సి.నాగరాణిని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలసి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం జిల్లా జాయింటు కలెక్టరు సీవీ ప్రవీణ్ ఆదిత్యను ఆయన ఛాంబరులో కలిశారు.

ఇంటింటికీ రక్షిత తాగునీటికి చర్యలు


మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరు, జూలై 10 : నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. మొగల్తూరు పంచాయతీలోని బహుత్తర మంచినీటి ప్రాజెక్టును బుధవారం సందర్శించి మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు బహుత్తర మంచినీటి ప్రాజెక్టులను సందర్శించి ప్రాజెక్టు నిర్వహణ, తాగునీటి సరఫరాలో గల ఇబ్బందులు తెలుసుకుంటున్నామన్నారు. కాలువల్లో గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయి కనీస నీటి పారుదలకు ఇబ్బందిగా ఉండటంతో వాటిని తొలగించే పనులు జరుగుతున్నట్టు తెలిపారు. అనంతరం కోనాయికోడు డ్రెయిన్‌ను ఎమ్మెల్యే నాయకర్ పరిశీలించారు. త్వరలో ఈ డ్రెయిన్ ప్రక్షాళన చేస్తామని నాయకర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తనకు గాని, తమ కార్యాలయంలో గాని తెలిపితే పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట ప్రాజెక్టు పరిధి గ్రామాల సర్పంచ్‌లు తణుకుల మునేశ్వరరావు, బందెల ఏలీజా, లోకం నాని, పడవల సత్యనారాయణ, కొల్లాటి గోపాలకృష్ణ, నిప్పులేటి తారక రామారావు, లక్కు బాబి, ముక్కు పుల్లయ్య నాయుడు, దేశంశెట్టి శ్రీను, మెండి రాజేష్, కడిమి రామకృష్ణ, ముక్కు గిరి, కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తాం

నరసాపురం రూరల్ 10 : గ్రామాల్లో మౌలిక సదుపాయల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు చాగంటి చిన్నతో కలసి బుధవారం మండలంలో సుమారు రూ.ఐదు కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నాయకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో తీరప్రాంత రహదార్లు అధ్వానంగా మారాయన్నారు. పెండింగ్ పనులన్నిం టిని పూర్తి చేసి, తీర ప్రాంత వాసుల ఇబ్బందుల్ని తీరుస్తామన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక విజన్ ఉన్న ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఎ.చంద్రశేఖర్, కె.వెంకటేశ్వరరావు, వి.నాని, వి.రవీంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు


డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 10 : అభివృద్ధి పనులలో అలసత్వం వహించవద్దని ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు (అంజిబాబు) అధికారులకు సూచించారు. ఒకటో పట్టణంలోని సింహాద్రి అప్పనగుడి రోడ్డులో జరుగుతున్న డ్రెయినేజీ కల్వర్టు పనులను ఎమ్మెల్యే అంజిబాబు బుధవారం పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారులు, జనసేన నాయకులు ముచ్చకర్ల శివ పాల్గొన్నారు. అనంతరం గొట్టిముక్కల వారి తోటలోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీశారద మాత వేదమాత సంక్షేమ చారిటబుల్ ట్రస్టు వారి శ్రీపాద కృష్ణమూర్తి ఘనపాఠీ స్మారక వేదసభలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొన్నారు.

మల్టీ ప్లెక్స్‌లో ఎమ్మెల్యే కార్యాలయం

ఎడ్వర్డు ట్యాంకు వద్ద ఉన్న ఎమ్మెల్యే అంజిబాబు కార్యాలయం ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లోని రెండో ఫ్లోర్‌కు మార్చారు. పలువురు నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, చెరుకూరి రామకృష్ణ చౌదరి అభినందనలు తెలిపారు.

మున్సిపాలిటీలో అవినీతిని బయట పెడతా


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 10: తాడే పల్లిగూడెం మున్సిపా లిటీ లో జరిగిన అవినీతిని బయట పెడతామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణ మున్సిపాలిటీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కొంతమంది అధికారులు, సిబ్బంది విధులకు హాజరు కాకపోవ డంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా సిబ్బంది అలస త్వం వహించి ప్రజల సమస్యలను పరిష్కరించకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణతో ఇప్పటికే మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ కోరామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జగన్

తాడేపల్లిగూడెం రూరల్ : జగన్ తన స్వార్థం కోసం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూని చేశాడని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రామన్నగూడెంలో బుధవారం ప్రజాదర్బారు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి వలవల బాబ్జి, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, బీజేపీ నియోజ కవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీతో ప్రగతి బాటలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 10: ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణరంగం ఊపందుకుంటుందన్నారు. అనంతరం వేల్పూరులోని ఆరిమిల్లి అలివేలు మంగ తాయారు మెమోరియల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మాజీ సర్పంచ్ పెనుమర్తి సోమ సూర్యచంద్రరావు కుమార్తె మాధురి, అల్లుడు నాగేంద్రబాబు రూ. లక్షా 50 వేలతో సమకూర్చిన వైద్య పరికరాలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వైద్యులకు అందజేశారు. సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచ్ గుణ్ణం రాజారావు, మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాదు, మాజీ ఎంపీపీ ఆరిమిల్లి మంగతాయారు, టీడీపీ నాయకులు డాక్టర్ డి.వెంకట సుధాకర్, బి.రామకృష్ణ, కె.వెంకట కృష్ణ పాల్గొన్నారు.

● పెనుమంట్ర : ఉచిత ఇసుక పాలసీని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మార్టేరు వేణు గోపాల స్వామి ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ ఇంచార్జి చింతపల్లి రామకృష్ణ గ్రామ పార్టీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, చిర్ల బాలాజీ రెడ్డి వి.బులిరామిరెడ్డి, గణపతి నీడి రాంబాబు, కె.చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

తణుకు. జూలై 10: చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో టీటీఎస్ గ్రూప్ కంపెనీ లు, ఎస్‌సీఐఎం కళాశాల జేకేసీ సెంటర్ ఆధ్వర్యంలో గురు వారం ఉదయం తొమ్మిది గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు .ఆయా సంస్థలలో అకౌంటెంట్ పోస్టులు 10, ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 50, టాక్స్ ఏజెన్సీ పోస్టులు 20, కెమిస్టు పోస్టులు 50 ఖాళీలు ఉన్నాయన్నారు. ఇతర వివరాల కోసం 93818 39672లో సంప్రదించాలన్నారు.

గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపునకు

నిధులు మంజూరు : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 10 : జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఆయకట్టు పరిధిలోని 49 కాలువల్లో గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.545. 79 లక్షలు, డ్రెయిన్స్ పనులకు రూ.592.59 లక్షలు మంజూరైనట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వీటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, 45 పనులను ఏజెన్సీలకు అప్పగించామన్నారు. వీటిలో కలుపు తొలగింపు పనులు ఆరు ఇప్పటికే ప్రారంభించామని, మిగిలినవి ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ చెప్పారు. నిడదవోలు గోదావరి పశ్చిమ డివిజన్ కింద పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో 5,29,962 ఎకరాల ఆయకట్టు ఉందని, దాదాపు 357 కిలోమీటర్ల పొడవు గల 11 ప్రధాన కాలువల ద్వారా, సుమారు 1,766 కిలోమీటర్ల పొడవున నిడదవోలు, పశ్చిమగోదావరి జిల్లాలో నీటి పంపిణీ జరుగుతుందన్నారు. అలాగే భీమవరం డ్రైనేజీ డివిజన్‌కు సంబంధించి 40 గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.914.46 లక్షలు, 57 డీసిల్టింగ్ పనులకు రూ.712.48 లక్షల ప్రతిపాదనలను కడా కమిషనర్ కార్యాలయానికి పంపామన్నారు. వీటిలో 35 కలుపు తొలగింపు పనులకు రూ.592.59 లక్షలు మంజూరయ్యాని తెలిపారు. ఇప్పటికే ఈ పనులు ప్రారంభించామన్నారు. గోదావరి పశ్చిమ డెల్టాలో 13 మేజర్, 41 మీడియం, 454 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయని, డెల్టాలోని మొత్తం ఆయకట్టు ప్రాంతంలో 3,78,745 లక్షల ఎకరాల పరిధిలో ఇవి వినియోగంలో ఉన్నాయని తెలిపారు. ప్రధాన కాలువల మొత్తం పొడవు సుమారు 295 మీటర్లు కాగా, మీడియం 328 కిలో మీటర్లు, మైనర్ కాలువలు దాదాపు 959 కిలో మీటర్ల మేర ఏడు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

రైతులు శ్రద్ధ వహించాలి

పోడూరు , జూలై 10 : నారుమడులు వేసే సమయంలోనే రైతులు శ్రద్ధ వహించాలని పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి అన్నారు. కవిటం, తూర్పుపాలెం, పండితవల్లూరు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఎంఏవో జి.సత్యనారాయణ, ఏఈవోలు నరసింహమూర్తి, పి.ప్రభాకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

పెనుగొండ, జూలై 10 : గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అన్నారు. పెనుగొండ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన బుధవారం పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు రూ. కోటి 20 లక్షలతో 31 తీర్మానం చేసి ఆమోదించినట్లు తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు పోడూరి గోవర్ధన, వార్డు సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టండి

పెనుగొండ, జూలై 10 : అంటు వ్యాధులు ప్రబలకుండా రక్షిత తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సార్వా పనులు ప్రారంభించాలని ఏవో స్పందన తెలిపారు. రోడ్ల రిపేరు నిమిత్తం ప్రతిపాదనలు పంపామని ఆర్‌అండ్‌బీ ఏఈ, డ్రెయిన్‌లు, కాలువలు చెత్త తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఇరిగేషన్ అధికారి తెలిపారు. ఎంపీడీవో ఎస్. శ్రీనివాస దొర,జెడ్‌పీటీసీ పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, చంటి పాల్గొన్నారు.

పూడిక తీత

అత్తిలి, జూలై 10: కేవీఎస్ గట్టు రాజీవ్‌నగర్ కాలనీలో మురుగు వెళ్లే డ్రెయిన్ ఐదేళ్లుగా పూడుకుపోవడంతో కాలనీవాసులు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్థానిక పార్టీ నాయకులు, పంచాయతీ అధికారులను డ్రెయిన్ పూడిక చేపట్టాలని ఆదేశించడంతో స్థానిక నాయకులు ఆధ్వర్యంలో మురుగు డ్రెయిన్ పూడిక తొలగించారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పశువులకు స్వచ్ఛమైన నీరు తాగించాలి

నరసాపురం రూరల్, జూలై 10: పశువులకు రైతులు స్వచ్ఛమైన నీటిని తాగించాలని పశువైద్యాధికారి ఏడీ డాక్టర్ సుధాకర్ తెలిపారు. గేదెలకు మురికి నీరు, కలుషిత నీరు పట్టించడం వల్ల గొంతువాపు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధి సోకితే టీకాలు వేయించాలన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

పాలకొల్లు రూరల్, జూలై 10 : పట్టణంలోని ఎంఎంకేఎస్‌ఎం హైస్కూల్, బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్స్‌లో బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను టీడీపీ నాయకులు అందజేశారు. తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, ఎంఈవోలు వీరాస్వామి, గంగాధర శర్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు (జీవీ), జనసేన, బీజేపీ నాయకులు బోణం నర్సయ్య, జక్కంపూడి కుమార్, విద్యా కమిటీ చైర్మన్ జగన్నాథరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 10 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రామరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఏసీఎస్‌వీ ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పేరిట సేవలు అభినందనీయం

భీమవరం టౌన్, జూలై 10 : గతించిన తల్లిదండ్రుల పేరిట సేవా కార్యక్రమాలు చేస్తే వారికి ఆత్మకు శాంతి కలుగుతుందని టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి అన్నారు. స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో మెంటే మంగతాయారు సంతాప సభ నిర్వహించి దివ్యంగులకు భోజనాలు, కంచాలు, గ్లాసులు, రగ్గులు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్లు గనిరెడ్డి త్రినాద్, మైలబత్తుల ఐజాక్ బాబు, ఎద్దు ఏసుపాదం, షేక్ రబ్బానీ, మంగతాయారు, చెరుకువాడ రంగసాయి, నరహరి శెట్టి కృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

భీమవరం క్రైం, జూలై 10 : ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని న్యాయవాదులు ఎస్.సుధీర్, పులిదిండి అంబేడ్కర్, బి.సునీల్‌కుమార్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, భీమవరం ఆదేశాల మేరకు పెదఅమిరం సచివాలయం వద్ద బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ లాయర్స్ అంబేడ్కర్ లింగ నిర్ధారణ చట్టం 1994, నార్కిమెల్లి సుధీర్ మహిళా చట్టాలు, సామాజిక న్యాయం గురించి వివరించారు. ఉచిత న్యాయం, లోక్ అదాలత్ అనే అంశాలపై సచివాలయ సిబ్బందికి, బాల బాలికల రక్షణ పథకం, గృహ హింస చట్టాల ప్రాముఖ్యతను గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ డి.సోమేశ్వరరావు, వీఆర్వో హరిరామ్‌కుమార్, పారా లీగల్ వలంటీర్ శ్రీలక్ష్మీ, మహిళా పోలీస్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి

భీమవరం టౌన్, జూలై 10 : విద్యార్థి దశ నుంచే సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలో విద్యార్థులకు పోటీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, మాధవి లత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న పొత్తూరి

నరసాపురం టౌన్, జూలై 10: నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఇంచార్జి పొత్తూరి రామరాజు పిలుపునిచ్చారు. బుధవారం రాయపేటలోని ఆయన నివాసంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై కూడా పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు కొల్లు బాబూ రావు మృతికి కొద్దిసేపు మౌనం పాటించారు. కొప్పాడ రవి, వాతాడి ఉమా, గుబ్బల నాగరాజు, జక్కం శ్రీమన్నారాయణ, అధికారి ఆనంత రామారావు, జోగి పండు, సంకు భాస్కర్, నంది నర్సింహారావు, కాగిత వెంకటేశ్వరావు, పద్మ, శశిదేవి, తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 10: చినతాడేపల్లిలో చేపల చెరువుల వేలం బుధవారం ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్త చెరువు రూ. 25 లక్షలకు, వడపు చెరువు రూ.29 లక్షలకు, అంకుడు చెరువు రూ.29.25 లక్షలకు పాటదారులు దక్కించుకున్నట్లు వెంకటేష్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువులు అధిక ధరలు వచ్చినట్టు తెలిపారు. సర్పంచ్ పిచ్చికల రాజారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

గణపవరం, జూలై 10: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్లు పెరుమాళ్ళ మురళీకృష్ణ, పెరుమాళ్ళ మహలక్ష్మి అన్నారు. స్థానిక లలిత పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన శ్వాసపై ధ్యాస ధ్యాన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. సభ్యులు కొత్తపల్లి సత్యనారాయణ, గట్టిం రాజు, తన్నీడి వాసు, రిటైర్డ్ టీచర్ అల్లూరి గంగరాజు, ఉరదాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో ప్రజల ఆందోళన

నరసాపురం, జూలై 10: పట్టణంలోని 25వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో మూడు రోజులుగా కుళాయిల్లో వస్తున్న కలుషిత నీటిని అరికట్టి స్వచ్ఛమైన నీటిని అందించాలంటూ బుధవారం సీపీఎం డిమాండ్ చేసింది. కాలనీ వాసులతో కలిసి వార్డు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరాజు మాట్లాడుతూ డ్రైనేజీ నీరు ట్యాప్‌ల్లో కలిసిపోతుందని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే రిపేర్లు చేయించాలన్నారు. జ్యోతి, ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఏవోగా జాన్సన్

నరసాపురం రూరల్, జూలై 10: వ్యవసాయ శాఖ ఏవోగా డాక్టర్ జాన్సన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు, ఆయన పాలకొల్లు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన డాక్టర్ రాజశేఖర్ పాలకొల్లు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఏవోను సిబ్బంది అభినందించారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

పెనుగొండ, జూలై10 : ఈ విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలను సాధించేవిధంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరి సునీల్ రాజ్‌కుమార్, ఏఎంవో సంజీవరావు అన్నారు. పెనుగొండ గురుకుల పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల నుంచి పలు విషయాలు తెలుసుకున్నారు. బ్రిడ్జి కోర్సులో మాతృభాష, ఆంగ్ల, హిందీ, గణితంలో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు.